క్లుప్తంగా

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 24వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజాసేవలోనే సంతృప్తి



చీరలు పంపిణీ చేస్తున్న కోలా గురువులు తదితరులు

అల్లిపురం : రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవలోనే సంతృప్తి ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కర్రి నీలకంఠాన్ని అభినందించడం ఆనందంగా ఉందన్నారు. జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం తన పుట్టిన రోజును కుటుంబ సభ్యులతో కాకుండా పేద ప్రజల మధ్య జరుపుకుని, వారికి చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. శనివారం సాయంత్రం కెప్టెన్ రామారావు జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కర్రి నీలకంఠాన్ని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, నీలాపు రమణారెడ్డి, బొడ్డు పోలారావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న కోలా గురువులు



శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకుంటున్న కోలా గురువులు

జగదాంబ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామి వివేకానంద సంస్థలో ఏర్పాటు చేసిన కృష్ణ పూజల్లో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొని ఉట్టి కొట్టారు. జీవీఎంసీ 39వ వార్డు వివేకానంద సంస్థలో నాల్గో రోజు కృష్ణుడికి 18 రకాల పూలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకున్న కోలా గురువులు మాట్లాడుతూ దైవ భక్తికి, సామాజిక సేవకు వివేకానంద సంస్థ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

కంచరపాలెం: ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ నరవలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి చేయని వారు, ఆర్ అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ మేళాకు అర్హులన్నారు. 15 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం నరవ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నేరుగా బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 93987 85720 నంబర్‌లో సంప్రదించాలని విజయలక్ష్మి సూచించారు.

తప్పు చేస్తే.. శిక్ష తప్పదు

- చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు కాబట్టే టీడీపీ శ్రేణుల మౌనం
- నేరానికి పాల్పడి.. అరెస్టు చేయొద్దంటే ఎలా?
- బాబు అరెస్టుపై గళం విప్పిన సామాన్యులు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు కావటంపై సామాన్యులు స్పందిస్తున్నారు. తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదని వారంటున్నారు. చట్టం ముందు ఎవరైనా సమానమే అని.. తప్పు చేసి ఎవరూ తప్పించుకోలేరని అభిప్రాయపడ్డారు. చంద్రబాబునాయుడు తప్పు చేయబట్టే పోలీసులు ఆయనను అరెస్టు చేసినా.. తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను హౌస్ అరెస్టులు చేసినా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పందించటం లేదని చెబుతున్నారు.

డాబాగార్డెన్స్ : చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోవడంతో విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నుంచి స్పందన కరవైంది. పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్ని అరెస్టు చేసినప్పటికీ కార్యకర్తలు ఎవరూ బయటికి వచ్చి నిరసన తెలపకపోవడమే చంద్రబాబు స్కామ్‌కు నిదర్శనం. నియోజకవర్గ పరిధి 14 వార్డుల్లో ఎక్కడా కూడా చంద్రబాబుకు మద్దతుగా నిరసనలు తెలపకపోవడం విశేషం. ఎందుకంటే చట్టం ముందు అందరూ సమానమే. తప్పు చేసిన వ్యక్తికి శిక్ష తప్పదు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే సీఐడీ అరెస్టు చేసిందన్న ధోరణిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలున్నారు. కాస్తో..కూస్తో.. తెలుగుదేశం పార్టీపై అభిమానం ఉన్న వారంతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తూతూ మంత్రంగా పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడినట్టు రుజువులున్నాయి..



తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చూపించి చంద్రబాబు రూ.371 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. తప్పు చేశాక ఎంతటి వారికైనా శిక్ష తప్పదు. అందుకు చంద్రబాబే ఉదాహరణ. చంద్రబాబు అరెస్టు వెనుక ఎటువంటి కుట్ర, ఎవరి హస్తం లేదు. అన్ని ఆధారాలతో అరెస్టు చేస్తే టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. అవినీతికి పాల్పడినట్టు రుజువులున్నాయి కాబట్టే పోలీసులు అరెస్టు చేశారు.

–ఎస్‌కే చోటా, సేల్స్‌మేన్

తప్పు చేసిన వ్యక్తిని అరెస్టు చేయకూడదా?



తప్పు చేసి.. ప్రజాధనం దుర్వినియోగం చేసి, రాష్ట్ర ప్రజలను పెట్టుబడుల పేరిట ముంచెత్తిన చంద్రబాబుని అరెస్టు చేయకూడదా? చంద్రబాబు చేసిన అవినీతి బట్టబయలు అయింది. తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో ఎంతో నైపుణ్యంగా స్కాంకు పాల్పడినప్పటికీ చివరికి చట్టానికి దొరక్క తప్పలేదు. ప్రజాధనాన్ని దోచేయడం చాలా దారుణం. సీఐడీ అన్ని ఆధారాలతో అరెస్టు చేసింది. ఇందులో ఎవరి ప్రమేయం లేదు.

–దామోదర్, కుమ్మరవీధి, అల్లిపురం

నీ నిజాయితీ నిరూపించుకో..



చంద్రబాబు నిజాయితీ నిరూపించుకోవడానికి సమయం వచ్చింది. తప్పు చేయకపోతే నిజాయితీ నిరూపించుకుని ప్రజాక్షేత్రంలోకి వస్తే.. నీ అంతటి నాయకుడు మరెవరూ ఉండరు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు న్యాయమైనదే. నిజాయితీపరుడ్ని అని చెప్పుకునే వ్యక్తిని గత మూడు సంవత్సరాలుగా సీఐడీ, ఈడీ, జీఎస్‌టీ, విజిలెన్స్ సంస్థలు దర్యాప్తు చేసి తగిన ఆధారాలతో అరెస్టు చేశాయి.

–సూరిశెట్టి శ్రీను, ఆటో కార్మికుడు

ఎప్పుడూ తప్పించుకునే ప్రయత్నమే..



అనేక సందర్భాల్లో స్టేలు తెచ్చుకుని తప్పించుకుంటూ చంద్రబాబు వచ్చారు. సీఐడీ అరెస్టు చేస్తే ఏదో కక్ష సాధింపు అంటున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేయడమే కాక ప్రజల్ని మోసం చేసి సొంత ఖాతాల్లోకి వేసుకోవడం తప్పుకాదా? ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి తెలంగాణలో ఆ రోజు కేసీఆర్‌తో ఒప్పందం చేసుకుని పదేళ్ల ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్‌ను వదిలి వచ్చేశారు.

–కె. సత్యారావు, స్పోర్ట్స్ కోచ్

బాబు అరెస్టును ప్రజలు స్వాగతిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : చంద్రబాబు అరెస్టును ప్రజలు స్వాగతిస్తున్నారని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. శనివారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అయినా ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ కనీసం నోరు మెదపడం లేదన్నారు.

వెంకటాద్రిపై విశేష పూజలు

సింహాచలం: వెంకటాద్రిపై శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వినోద్ బాలుకు 'సురా' పురస్కారం



అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సోషల్ వర్కర్ వినోద్ బాలు

సీతంపేట: హేతువాది పేరిచర్ల సుబ్బరాజు (సురా) సామాజిక సేవా పురస్కారం 2023 సంవత్సరానికి సోషల్ వర్కర్ ఉడుముల వినోద్ బాలుకు ప్రదానం చేశారు. సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రక్తదాన ఉద్యమకారుడు, 937 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 52 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి వేలాది మంది ప్రాణాలు నిలిపిన వినోద్ బాలుకు సురా పురస్కారం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలు చేస్తున్న కృషికి ఇప్పటికే యూత్ సర్వీసెస్ అవార్డు, ఛత్రపతి అవార్డు, ఆపద్బాంధవుడు, యంగ్ డైనమిక్ పర్సన్, భారత రక్త బంధు పురస్కారం వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు వరించాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ కె.బాబూరావు, రచయితలు అనిశెట్టి రజిత, కె.ఎస్.మల్లీశ్వరి, రిటైర్డ్ ప్రొఫెసర్ పేటా బాబివర్ధన్, సరిగమ సంగీత సంస్థ ఫౌండర్ ఎస్.కోటేశ్వరరావు, ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో అందిన ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 27వ వార్డు హరిజన వీధికి చెందిన పెద్దాడ రమణమ్మ పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా చికిత్స కోసం ఎమ్మెల్యేని సంప్రదించడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం చేయించడమే కాక మందుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 30వ వార్డు జాలారిపేటలో నివసిస్తున్న పార్టీ గృహసారథి సురకల వీరమ్మకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. ఆమెను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 39వ వార్డు చిలకపేటలో నివసిస్తున్న నక్క తోటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దశదిన కర్మ నిర్వహణకు రూ.5 వేలు అందజేశారు. 32వ వార్డు నేరెళ్లకోనేరులో నివసిస్తున్న గృహసారథి తల్లి ఉనుము పెద్దమ్మ ఇటీవల మరణించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రూ.3 వేలు, అదే ప్రాంతానికి చెందిన కోశెట్టి రామయ్యమ్మకు మందుల కోసం రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పలు వార్డుల అధ్యక్షులు మూలే రామిరెడ్డి, దళమంతుల మాణిక్యాలరావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి కోన శంకర్, ముజీబ్‌ఖాన్, బోని దేవా, పెంటపల్లి సత్యనారాయణ, రామలక్ష్మి, వడ్డాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చవితికి రాట ఉత్సవం



రాట ఉత్సవంలో పాల్గొన్న విల్లూరి భాస్కరరావు



రాట మహోత్సవంలో పాల్గొన్న బొడ్డేటి ప్రసాద్

జగదాంబ : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డు నాలుగు చిలకల ప్రాంతంలో రాట ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ విల్లూరి మాట్లాడుతూ ఏటా వార్డులోని చిలకల జంక్షన్ వద్ద 11 రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితీ అన్నారు. రానున్న చవితి పర్వదినం కోసం రాట ఉత్సవం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు శ్రీకారం..

అల్లిపురం : వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నగరంలో చిన్నా, పెద్ద ఉత్సాహం చూపిస్తున్నారు. దీంట్లో భాగంగా వేంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో పందిరి రాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పందిరి రాటకు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోరిబిల్లి ప్రసాద్, యల్లపు గోపాలరావు, సూరిశెట్టి శ్రీనివాస్, డీజే బాయ్స్ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో అవినీతి నిర్మూలన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు, ఉద్యోగులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డీఆర్ఎం కార్యాలయంలో శనివారం అవినీతి నిర్మూలన, నిఘా ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదుర్కొన్న అవరోధాలు, పొరపాట్లను సరిచేసుకునేలా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం వల్ల తదుపరి విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.పి.సిన్హా మాట్లాడుతూ ఉద్యోగులందరూ అవినీతి నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవినీతి, లంచాలకు తావులేని విధంగా నిష్పక్షపాతంగా సేవలందించేందుకు ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. రైల్వేలో టెండర్లు, ఆక్షన్లు, కాంట్రాక్టులు, పలు కార్యక్రమాల్లో క్రమశిక్షణ, నిజాయితీలతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్–2 పి.జె.శర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.అవినాష్ శర్మ, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సౌరభ్ ప్రకాష్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్(పర్సనల్) ఎ.రామారావు, ట్రాఫిక్, కమర్షియల్, పర్సనల్ బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 4.10 లక్షల జరిమానా



డాబాగార్డెన్స్‌లో వాహన చోదకులను తనిఖీ చేస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి

అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

అప్పన్న గోసంరక్షణ పథకానికి రూ. రెండు లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గోసంరక్షణ పథకానికి నగరంలోని మధురానగర్‌కు చెందిన ఎం.ఎస్.వి.ఎస్.బి.ఎల్. చంద్రిక అనే దాత శనివారం రూ. రెండు లక్షలు అందజేశారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో నగదు రూపంలో ఏఈవో రమణమూర్తికి ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేశారు. దేవస్థానం ఏఈ హరి, గోశాల సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

డీజీఎం బంగార్రాజుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు



బంగార్రాజును సత్కరిస్తున్న అతిథులు

సింహాచలం: జీవీఎంసీ 93వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, వైద్యులు టి.రవీంద్ర, నస్రిన్, శిరీష, కృష్ణ, సీత సత్కరించారు. కార్యక్రమంలోఉద్యోగులు వేణుగోపాల్, కనకరాజు పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కోరుకొండ రంగారావు బృందం

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శనివారం రాత్రి కోరుకొండ రంగారావు బృందం ప్రదర్శించిన హాస్యవల్లరి ప్రేక్షకులను అలరించింది. టీవీ–101, నాలుగు వారాల షాపింగ్ ఫ్రేమ్, ఉద్యోగం పోయింది, జనాభా లెక్కలు, సిట్యుయేషన్ సాంగ్ వంటి స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు హాస్యనటులను సత్కరించారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు హాస్యనాటికలను తిలకించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జేసీఐ లక్ష్యం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న జేసీఐ విశాఖ వేలీ సభ్యులు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నగర ప్రజలకు చక్కటి ఆరోగ్యాన్ని అందివ్వటమే లక్ష్యమని జేసీఐ విశాఖ వేలీ సంస్థ అధ్యక్షుడు అమరేష్ పేర్కొన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు సంతాన సమస్యలతో బాధపడుతున్న మహిళలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీఐ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా తొలిరోజు ఆరోగ్యపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రెండో రోజు తాగునీరు, మూడవ రోజు రోడ్ సేఫ్టీ తదితర అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారిని సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ సెక్రటరీ ఇంద్రజ, డెంటల్ డాక్టర్ విఠల్‌కుమార్, డాక్టర్ మురళీకృష్ణ, సురేష్, సింధూర తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ రక్తదాన శిబిరం

జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ ప్రైడ్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన వాల్తేర్ అప్‌రోడ్డులో గల మదర్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ వీక్ జైత్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రెసిడెంట్ కె. లక్ష్మీసురేఖ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్రటరీ చందు కటకం, కోశాధికారి కె. శ్రీను, సభ్యులు కె. రిషి, పి. అశోక్, వంశీ, పునీత్, ఎస్. సంతోష్, దేవుడునాయుడు, కె. లక్ష్మణరావు, వీవీ నాయుడుతో పాటు 20 మంది రక్తదాతలు, మదర్ బ్లడ్‌బ్యాంక్ అధినేత శివగుప్తా పాల్గొన్నారు.

క్షణికావేశంతో ఊహించని నష్టం

- చిన్నచిన్న కారణాలతోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు
- నేడు ప్రపంచ ఆత్మహత్యా నివారణ దినం

మహారాణిపేట : చదువులో వెనుకబడి పీఎంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కరకం గ్రామానికి చెందిన మీసాల రమ్య (16) విశాఖలో బోయిపాలెం ఎస్ఆర్ఐ హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఆమెతో పాటు మేనత్త కూతురు కూడా అదే కాలేజీలో చదువుతోంది. ఈమెతో పాటు ఇతర విద్యార్థుల కన్నా రమ్య చదువులో వెనుకబడింది. దీంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే దొండపర్తి రామాలయం వద్ద నివసిస్తున్న దల్లి రాజేష్ ఈనెల 4న ఆత్మహత్యకు పాల్పడినట్టు నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు. జీవితం మీద విరక్తి చెంది చనిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. నగరంలో సరాసరి రెండు రోజులకు ఒక ఆత్మహత్య కేసు నమోదు అవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కమిషనరేట్ పరిధిలో చిన్నచిన్న కారణాలతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కుటుంబ సమస్య గాని, విద్యాపరమైన సమస్య గాని, ఆఫీసులో సమస్య వల్ల కానీ ఇటీవల ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాగే మానసిక అనారోగ్యం గలవారు, మాదక ద్రవ్యాలకు బానిస అయిన వారు, లైంగిక హింసకు గురైన వారు, ఉద్రేకం, దూకుడు స్వభావం కలిగిన వారు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది ఆత్మహత్యల ద్వారా నిండు జీవితాన్ని ముగించుకుంటున్నారని ఒక అంచనా. వీటిలో నాల్గో వంతు భారత దేశంలోనే జరుగుతున్నాయని సర్వేలు చెబుతున్నాయి.

మానసిక వైద్యుడిని సంప్రదించాలి



ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉన్న వారు మానసిక వైద్యుడిని కలిసేలా ప్రోత్సహించాలి. వారు బాధితుల సమస్య తెలుసుకుని వారి ప్రయత్నాన్ని నివారించగలుగుతారు. ఆత్మహత్య ఆలోచనలు పదేపదే వస్తున్నప్పుడు కౌన్సెలింగ్, మందుల ద్వారా నయం చేయడానికి వీలు ఉంది. ఆత్మహత్య లేదా దిగులు వంటి లక్షణాలను గుర్తించడం, ఆత్మహత్య కోసం లేదా చావుల కోసం పదేపదే ప్రస్తావించే వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇలాంటి వారిని ఒంటరిగా వదలకపోవడం మంచిది.

డాక్టర్ కాశెల్లి వెంకట రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిన వైద్యశాల, విశాఖపట్నం.

ఆనందమానందమాయె..!

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనున్న తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో శనివారం పూర్వ విద్యార్థుల 3వ సమ్మేళనం మిలాన్–2023 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేవీ వాల్తేర్, మిలన్–2023 కన్వీనర్ కల్నల్ విజయ్ బలరామ్ మాట్లాడుతూ 1986 నుంచి 2023 వరకు ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎందరో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి, విజయవంతమైన వ్యక్తులుగా తయారుచేసి, మార్గనిర్దేశం చేసిన గురువులకు తామంతా రుణపడి ఉంటామని తెలుపుతూ.. కృతజ్ఞతగా వారందరినీ సత్కరించామన్నారు. సి.వి.రఘు, ఎన్.వి.సురూప, రాజకుమారి, విజయ్‌భాస్కర్, డి.భాస్కర్, అనిత, రవికిరణ్, హంజీ, వాసు, మూర్తి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.